మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ మనం
TELUGU DAILY తెలుగు డైలీ
Gmail: pprabhamanam@gmail.com
విలేకరులు కావలెను.
ఆంధ్ర మనం TV
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223
PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA
కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 53 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com సోమవారం 10-08-2026

## హైదరాబాద్‌లో 40 లక్షల

# ఓట్లు గల్లంతు?

- ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!
- హైదరాబాద్‌లో భారీగా తగ్గనున్న ఓటర్ల సంఖ్య
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా



రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, - మిగతా 2 లో



### నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్
- దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు
- నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి
- ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ - మిగతా 2 లో

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు



- బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!
- కాకతీయ రాణి రుద్రమదేవి బోనం సమర్పించినట్లు ఆధారాలు
- 1516లోనే బోనాలపై పన్ను రద్దు చేస్తూ శ్రీకృష్ణదేవరాయల శాసనం
- ప్లేగు వ్యాధి కంటే ముందే బోనాలు ఉన్నాయని రుజువు చేస్తున్న పరిశోధనలు
- కుతుబ్ షాహీల కాలం నుంచీ గోల్కొండలో నిరంతరాయంగా ఉత్సవాలు

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ చరిత్ర నిన్నమొన్నటిది కాదని, దానికి వేల ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉందని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. 1816లో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి - మిగతా 2 లో

## ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు



- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని తప్పుపట్టిన రాహుల్
- విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమంలో ఓ విద్యార్థి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. అమిత్ షా ఏదో ఒకరోజు సమాధానం చెప్పక తప్పదన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పటానికి బదులు వారినే క్షమిస్తున్నానని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి తనతో పంచుకున్న ఆవేదనను రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆదివారం పంచుకున్నారు.ఉన్న భూమి అమ్మి, అదీ చాలక అప్పులు చేసి మరీ పరీక్షకు సిద్ధమైతే చివరికి దక్కిందేమీ లేదని బాధిత విద్యార్థి వాపోయినట్లు రాహుల్ చెప్పారు. - మిగతా 2 లో

### ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌పై రచ్చ.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువ!



- లాస్ వెగాస్‌లో కొత్త హెయిర్‌స్టైల్‌తో కనిపించిన డొనాల్డ్ ట్రంప్
- ఆయన జుట్టుపై సోషల్ మీడియాలో మీమ్స్, జోకులు వైరల్
- ట్రంప్ లుక్‌పై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- చిత్తవైకల్యంతో బాధపడిన తన తండ్రిని ట్రంప్ గుర్తుచేశారని వ్యాఖ్య
- ట్రంప్ జుట్టుపై ఏఐ జనరేటెడ్ వీడియో కూడా ఆన్‌లైన్‌లో హల్‌చల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన హెయిర్‌స్టైల్‌తో వార్తల్లో నిలిచారు. ఇటీవల లాస్ వెగాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన సరికొత్త లుక్‌తో కనిపించారు. గతంలో కంటే భిన్నంగా, మరింత ఒత్తుగా, బంగారు రంగులో మెరిసిపోతున్న ఆయన జుట్టు అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆయన తన - మిగతా 2 లో




### బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా

# పెరిగిన గిరాకీ

- కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!
- ఆపరేషన్ సిందూర్‌తో బ్రహ్మోస్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు
- పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా దేశంలోని నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతం

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా, ఇప్పటికే - మిగతా 2 లో



### ఐక్యతే మన బలం క్విట్ ఇండియా స్ఫూర్తిపై పవన్ ట్వీట్

- క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకున్న పవన్ కల్యాణ్
- స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు
- సిసలైన భారతావని నిర్మాణమే వారికిచ్చే గౌరవమన్న పవన్
- ఐక్యత, సమష్టి సంకల్పమే దేశ నిజమైన బలమని వ్యాఖ్య

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ - మిగతా 2 లో



### తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ


- ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. - మిగతా 2 లో

## జాతీయ జెండాతో పాటు

# మీ అజెండా ఉండాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం
- విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్
- ద్రౌపది ముర్ము స్ఫూర్తితో ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు ౦ కావాలని యువతకు ఉద్బోధ



అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా - మిగతా 2 లో

## వేంపెంటలో ఆత్మకూరు పేదల వైద్యులు గౌరినాథ్ కు ఘనంగా నివాళులు అర్పించిన ప్రజాసంఘాల నాయకులు




**పాములపాడు ఆగస్టు,09,ప్రభ మనం:** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో పేదల వైద్యులు గౌరినాథ్ కు ఆదివారం గ్రామ నాయకులు బోనాల సామేలు, ఏసురత్నం, ఆనందరావు, యువరాజు, ఏసన్న, బోనాల భాస్కర్, ప్రసాదు, తదితరులు ఘన నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతమైన ఆత్మకూరు పరిసరాల్లో పేదలకు వైద్యసేవలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉత్తమ సేవలు అందించారని అన్నారు. బడుగు బలహీన వర్గాలతో పాటు చెంచు గూడేల్లాలోని గిరిజనులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అదించిన పేదల వైద్యులు గౌరినాథ్ లేకపోవటం ఆత్మకూరు ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం పేదల వైద్యులు గౌరినాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించి, ఆయన చేసిన వైద్య సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు నాగేశ్వరరావు, జయన్న, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమం





**తుగ్గలి ఆగస్టు 09 ప్రభ మనం న్యూస్ :**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తున్నామని దిగువ చింతలకొండ చిన్న పెద్దయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని దిగువ చింతలకొండ గ్రామంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కే. యి శ్యాం కుమార్ ఆదేశాల మేరకు మాజీ జిల్లా చైర్మన్ బత్తిన వెంకట్రాముడు చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం నుంచి ప్రజలు ఇంకా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆశిస్తున్నారో నేరుగా ప్రజల నుంచే తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో సంక్షేమం అందుతోందని వారు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజలు నిండు మనసుతో ఆశీర్వాదాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరింత కాలం కొనసాగాలని, అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలతో మమేకమై పనిచేసే అద్భుతమైన రాజకీయ పార్టీ టీడీపీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిరుపల్ నాయుడు,అప్పా వేణు,కొమ్ము వెంకటేష్, మోహన్,సోమశేఖర్ గౌడ్,హనుమంతు గౌడ్,శుభాష్ చంద్రబోస్,చక్రపాణి, కే. నాగేష్,డి,హాసేన్ పీరా,డి దస్తగిరి,రమేష్,గుత్తి వెంకట్రాముడు, లక్ష్మన్న, కేశవులు,కే. శ్రీనివాసులు,కే. సురేష్,డి,ఇమాం సాహెబ్, ఖాజావాలి,కె. హనుమప్ప, డి.హుసేని,అల్లబకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రోప్ స్కిప్పింగ్‌లో సాధన విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

### జిల్లాస్థాయిలో 9 మందికి పతకాలు.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**తుగ్గలి. ఆగస్టు. 9:( ప్రభ మనం న్యూస్):** జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ సెలక్షన్స్‌లో సాధన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం డోన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 15 మంది క్రీడాకారులు పాల్గొనగా, 9 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో నలుగురు బంగారు పతకాలు, ముగ్గురు రజత పతకాలు, ఇద్దరు కాంస్య పతకాలు సాధించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 23న రేణిగుంటలో జరగనున్న రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారు వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పాఠశాల కరస్పాండెంట్ దండు భాస్కర్ యాదవ్ తెలిపారు. గత రెండేళ్లుగా విద్యార్థులు క్రీడల్లోనూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

## నాయకుడు అంటే కేవలం ఆదేశాలు ఇచ్చి చేతులు దులుపుకునేవాడు కాదు

**బోయినపల్లి ఆగస్టు. 9:( ప్రభ మనం న్యూస్):** స్వయంగా ఆచరించి చూపించేవాడు అని నిరూపించారు సర్పంచ్ సౌమ్య మహేష్. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అలాగే గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆయన స్వయంగా రంగంలోకి దిగారు. తాజాగా గ్రామ పరిధిలోని రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఆయన స్వయంగా తన చేతులతో తొలగించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వర్షాకాలం మరియు వాతావరణ మార్పుల నేపథ్యంలో రోడ్ల పక్కన పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇవి వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారడమే కాకుండా, దోమలు, విషక్రిములకు ఆవాసంగా మారే ప్రమాదం ఉంది. ఈ సమస్యను గుర్తించిన మహేష్, కేవలం పంచాయతీ సిబ్బంది కోసం ఎదురుచూడకుండా, తన తోటి వారితో కలిసి ఉదయాన్నే శ్రమదానానికి పూనుకున్నారు. రోడ్డు మార్గాన్ని ఆక్రమించిన పెద్ద పెద్ద పొదలను, ముళ్ల చెట్లను స్వయంగా లాగిపారేస్తూ శ్రమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం గ్రామ పంచాయతీ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. ప్రజలు సైతం తమ ఇళ్ల చుట్టుపక్కల, రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో మరికొందరు యువకులు సైతం స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొనేందుకు ముందుకు వస్తున్నారు.

# జగనన్న రాకకు కర్నూలు స్వాగతం పలికేందుకు సిద్ధం...!!


### 13న కర్నూలు జిల్లాకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి.. ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షిని పరామర్శించనున్న మాజీ సీఎం

### పర్యటనను విజయవంతం చేసేందుకు కర్నూలు--నంద్యాల జిల్లాల వైయస్ఆర్‌సీపీ ముఖ్య నాయకుల సమన్వయ సమావేశం

### కర్నూలు పార్లమెంట్ పరిధి నుంచి భారీగా తరలిరావాలి.. పార్టీ శ్రేణులకు బుట్టా రేణుక పిలుపు







**కర్నూలు,ఆగస్టు,09,ప్రభ మనం:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు ఈ నెల 13వ తేదీన కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పర్యటనలో భాగంగా పంచలింగాల సబ్‌జైలులో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే శ్రీ బుసినె వీరుపాక్షి గారిని పరామర్శించనున్నారు. జగనన్న పర్యటనను విజయవంతం చేసేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులతో కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. పర్యటన ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల సమీకరణ, నాయకులు--కార్యకర్తల భాగస్వామ్యం, స్వాగత కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ తలసాని రఘురామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ సతీష్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి, రాయలసీమ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి విజయ మనోహరి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక గారు మాట్లాడుతూ.. శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి పర్యటనను విజయవంతం చేయడమే లక్ష్యంగా కర్నూలు పార్లమెంట్ పరిధిలోని పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కార్యకర్తలతో పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. జగనన్నకు ఘన స్వాగతం పలికేందుకు కర్నూలు పార్లమెంట్ పరిధిలోని పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బుట్టా రేణుక గారు పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు సమష్టిగా కదిలి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

జగనన్న కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ యంత్రాంగం సమన్వయంతో ముమ్మరం చేసింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గారు, నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి గారు, కర్నూలు మాజీ ఎంపీ, కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక గారు, నంద్యాల మాజీ ఎంపీ శ్రీ పోచా బ్రహ్మానందరెడ్డి గారు, నంద్యాల ఎమ్మెల్సీ శ్రీ ఇషాక్ గారు, కర్నూలు మాజీ మేయర్ శ్రీ బి.వై. రామయ్య గారు, మాజీ కుడా చైర్మన్ శ్రీ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి గారు, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ ఆదిమూలపు సతీష్ గారు, పత్తికొండ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీమతి కంగాటి శ్రీదేవి గారు, ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ గంగుల నాని గారు, బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కాటసాని రామిరెడ్డి గారు, నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ ధారా సుధీర్ గారు, ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ రాజీవ్ రెడ్డి గారు, కర్నూలు నగర అధ్యక్షులు శ్రీ మహ్మద్ అలీ ఖాన్ గారు, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ ప్రదీప్ రెడ్డి గారు, శ్రీ తెర్నేకల్ సురేందర్ రెడ్డి గారు తదితర మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ 100 పడకల హాస్పిటల్ లో అత్యవసర శస్త్ర చికిత్సలు చేయడానికి ట్రామా కేర్ సెంటర్ ను ప్రారంభించాలి

### పట్టణ ప్రజా సమస్యల పరిష్కారంకై సిపిఐ 4వ రోజు పాదయాత్ర

### సిపిఐ పార్టీ డిమాండ్





**ఎమ్మిగనూరు,ఆగస్టు,09,ప్రభ మనం:** పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో 4వ రోజు ఎంఎస్ నగర్ లో పాదయాత్ర కొనసాగింది. కాలనీల్లో పర్యటించిన సిపిఐ నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించడంలో పాలకులు,అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు సొంత ఇల్లు నిర్మించుకునేందుకు 2 సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేదల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మైనారిటీ కాలనీలో 2014 సంవత్సరంలో నిర్మించిన టిడ్కో గృహాలను ఇప్పటికైనా లబ్ధిదారులకు అప్పగించాలి. ఇళ్లు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. పేదల కోసం నిర్మించిన ఇళ్లను ఖాళీగా ఉంచకుండా అర్హులైన లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ట్రామా కేర్ సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందుబాటులో లేక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల విలువైన సమయం వృథా అవుతోందని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలను సమకూర్చి ట్రామా కేర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఎస్.ఎస్. వాటర్ ట్యాంకుల నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలి. పట్టణ ప్రజలకు రెండు పూటల తాగునీరు వచ్చే విధంగా శాశ్వత చర్యలు చేపట్టాలని అన్నారు. ఎం.ఎస్. నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచిపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా హామీలకే పరిమితమైతే ప్రజల తరఫున మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాయకులు సుంకన్న,నరసప్ప, రాజు, సూరి, నరసింహులు,వీరేష్,మల్లన్న, జయలక్ష్మి, శైలజ, పరశమ్మ, లక్ష్మీ, మహాలక్ష్మి, సిపిఐ నాయకులు, నరసింహులు, కాజా,ఇస్మాయిల్, రామాంజనేయులు,మధు, తదితరులు పాల్గొన్నారు

# రూ. 7,500 జీతం... రూ. 85,000 ఖర్చు!

### కార్పొరేటర్ల లగ్జరీ లైఫ్‌స్టైల్ వెనుక 'అక్రమ' మార్గాలు?

1. ఆదాయం పిడికెడు... వ్యయం కొండంత!
2. నెలవారీ ఖర్చుల్లో తేడా... అవినీతి వైపే వేలెత్తి చూపుతున్న ప్రజాప్రతినిధులు!
3. కరెంట్ బిల్లులకే వేలు... ఈఎమ్ఐలకు వేలకు వేలు!
4. ప్రజాసేవ పేరిట గెలిచి... అక్రమార్జనతో లగ్జరీ లైఫ్‌స్టైల్







కరీంనగర్ **ఆగస్టు. 9:( ప్రభ మనం న్యూస్):** ప్రజాసేవ చేయాలనే తపనతో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచామని చెప్పుకునే కార్పొరేటర్ల నిజస్వరూపంపై ఇప్పుడు తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది. నెలకు పొందే అరకొర గౌరవ వేతనానికి, వారు చేస్తున్న నెలకు వేల రూపాయల ఆడంబర ఖర్చులకు అస్సలు పొంతన కుదరకపోవడంతో "మన ప్రతినిధులు అక్రమ మార్గాల్లోకి మారుతున్నారా?" అనే బలమైన సందేహం సామాన్య ప్రజానీకంలో వ్యక్తమవుతోంది.

**ఆదాయం పిడికెడు... వ్యయం కొండంత!**

ప్రభుత్వం నియమాల ప్రకారం ఒక కార్పొరేటర్‌కు నెలకు అందే అధికారిక గౌరవ వేతనం (జీతం) కేవలం ?7,500 మాత్రమే. కానీ, క్షేత్రస్థాయిలో వారి జీవనశైలిని గమనిస్తే సామాన్యుల కళ్ళు బైర్లు కమ్మక తప్పదు. ఒక సగటు కార్పొరేటర్ ఇంటి నెలవారీ కరెంట్ బిల్లే రూ. 7,000 నుండి రూ. 8,000 వరకు వస్తోంది. ఇక లగ్జరీ వాహనాలపై కట్టిన ఈఎమ్ఐల రూపంలో ప్రతి నెలా రూ. 30,000 పైచిలుకు చెల్లిస్తున్నారు. తమ వెంట ఉండే అనుచరులు, సిబ్బంది జీతాల కోసం మరో రూ. 9,000 నుండి రూ. 12,000 వ్యయం చేస్తున్నారు. ఇవన్నీ ఒకెత్తయితే, రెండు వాహనాల పెట్రోల్ ఖర్చులకు రూ. 12,000 నుండి రూ. 15,000, ఇంటి అద్దె కింద మరో రూ. 12,000 నుండి రూ. 15,000 వరకు వెచ్చిస్తున్నారు.

**నెలకు రూ. 85 వేల ఖర్చు ఎలా సాధ్యం?**

సకల సౌకర్యాలు, హంగులు, ఆడంబరాల మధ్య జీవించే ఒక కార్పొరేటర్ మొత్తం నెలవారీ ఖర్చు సగటున రూ. 72,000 నుండి రూ. 85,000 వరకు ఉంటోందని విశ్వసనీయ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారికంగా చేతికి వచ్చేది రూ. 7,500 అయినప్పుడు, ఈ భారీ వ్యత్యాసాన్ని భరించడానికి డబ్బు ఎక్కడి నుంచి వస్తోందనేది యక్ష ప్రశ్నగా మారింది. స్వయంగా ఏ వ్యాపారమూ లేనివారు సైతం ఇంత సొమ్మును ప్రతి నెలా ఎలా ఖర్చు చేయగలుగుతున్నారు?

**వేలెత్తి చూపుతున్న అవినీతి అక్రమాలు!**

అధికారిక ఆదాయానికి, వాస్తవ వ్యయానికి మధ్య కొండంత వ్యత్యాసం ఉండటం నేరుగా అక్రమార్జన మరియు అవినీతి వైపే వేలెత్తి చూపుతోంది. డివిజన్లలో జరిగే అభివృద్ధి పనుల్లో కమీషన్లు, ఆక్రమణదారుల నుంచి వసూళ్లు, స్థానిక దందాలు, పర్మిషన్ల పేరిట సాగే వసూళ్ల వల్లే ఈ స్థాయిలో నెలకు వేలకు వేలు ఖర్చు పెట్టగలుగుతున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సేవ పేరిట వచ్చి స్వార్థపూరిత రాజకీయాలు చేస్తూ, అవినీతి కూపంలో మునిగి తేలుతున్న ఇటువంటి ప్రజాప్రతినిధుల తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇలాంటి వారి వ్యయాలపై దృష్టి సారించి, ఆదాయానికి మించిన ఖర్చుల వెనుక ఉన్న అసలు రంగును బయటపెట్టాలని స్థానికులు కోరుతున్నారు

## ఐఫోన్ లవర్స్‌కు గుడ్‌న్యూస్ త్వరలోనే


# ఆపిల్ నుంచి మడతబెట్టేఫోన్ వచ్చేస్తోంది



మార్కెట్‌లో ఆపిల్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యంగా ఐఫోన్లకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో మొబైల్ కంపెనీలు ఫోల్డబుల్ ఫోన్లపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటి వరకు శామ్‌సంగ్, వన్‌ప్లస్ తదితర కంపెనీలు ఫోల్డబుల్ మొబైల్స్‌ని పరిచయం చేశాయి. ఆపిల్ మాత్రం ఫోల్డబుల్‌పై దృష్టి మాత్రం సారించలేదు. ప్రస్తుతం కంపెనీ ఫోల్డబుల్ మోడల్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. అయితే, కంపెనీ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఆపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని 2026 నాటికి లాంచ్ చేయనున్నదని ఓ నివేదిక తెలిపింది. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ గత కొద్దిరోజులుగా స్థిరమైన వృద్ధిని సాధించింది. ఈ రంగంలో శాంసంగ్, హువావే, మోటరోలా తదితర ప్రధాన కంపెనీలు ముందున్నాయి. శామ్‌సంగ్ జెడ్-సిరీస్‌తో మార్కెట్‌లో ముందంజలో ఉన్నది. ప్రతి కొత్త వెర్షన్‌తో డిజైన్‌తో పాటు క్వాలిటీని సైతం మెరుగుపరుస్తూ వస్తున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేస్తుందన్న వార్త వినియోగదారుల్లో ఉత్సాహాన్ని పెంచింది. ఆపిల్ ఫోల్డబుల్ ఐఫోన్ మార్కెట్లో కొత్త అవకాశాలను తెరిచి, యూజర్లకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుందని నివేదిక పేర్కొంది. ఇటీవల డీఎస్‌సీసీ (డిస్‌ప్లే సప్లై చైన్ కన్సల్టెంట్స్) నివేదిక 2019 నుంచి 2023 వరకు ప్రతి సంవత్సరం 40 వృద్ధి చెందుతున్న తర్వాత.. 2024లో మార్కెట్ కేవలం 5శాతం పెరుగుతుందని అంచనా వేస్తూ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ సవాళ్లను హైలైట్ చేసింది. 2024లో థర్డ్ క్వార్టర్‌లో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లేల డిమాండ్ సంవత్సరానికి 38శాతానికి తగ్గింది. ఫ్లెక్సిబుల్ ఓఎల్ఈడీ డిస్‌ప్లే మిలియన్ల సార్లు ఫోల్డ్ చేసినా ఎలాంటి నష్టం లేకుండా పని చేస్తుంది. ఆపిల్ కొత్త డిజైన్.. ప్రస్తుత ఐఫోన్ పీచర్స్, కొత్త ఫోల్డింగ్ మెకానిజానికి జోడించడం ద్వారా ఓ ప్రత్యేకమైన ఎక్స్‌పీరియన్స్ అందించనున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ అందుబాటులోకి వస్తే మార్కెట్‌పై భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆపిల్ ఉత్పత్తులు మార్కెట్లకు భారీగా డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే.

## కింగ్‌ఫిషర్ టవర్స్‌లో కోట్లు ఖరీదైన

## ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన ఇన్ఫీ నారాయణమూర్తి



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి లగ్జరీ అపార్ట్‌మెంట్ ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బెంగళూరు లోని ప్రఖ్యాత కింగ్‌ఫిషర్ టవర్స్ లో రూ.50 కోట్లు వెచ్చించి విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. నివేదికల ప్రకారం.. నాలుగు బెడ్‌రూమ్‌ల ఈ ఫ్లాట్ 8,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16వ అంతస్తులో ఉంది. మొత్తం ఐదు విలాసవంతమైన కార్లను పార్క్ చేసుకోవచ్చు. ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త నుంచి ఈ ఫ్లాట్‌ను మూర్తి కొనుగోలు చేశారు. కాగా, నాలుగేళ్ల క్రితం నారాయణమూర్తి భార్య సుధామూర్తి అదే కాంప్లెక్స్‌లోని 23వ అంతస్తులో రూ.29 కోట్లతో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ టవర్స్ బెంగళూరు నడిబొడ్డున యూబీ సిటీలో ఉంది. ఇది కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా పూర్వీకుల ఇల్లు ఉన్న స్థలం. దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని విజయ్ మాల్యా- ప్రెస్టీజ్ గ్రూప్ రెండు కలిసి అభివృద్ధి చేశాయి. 34 అంతస్తుల కింగ్‌ఫిషర్ టవర్స్‌లో మూడు బ్లాక్‌లు ఉన్నాయి. వీటిలో 81 అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు ఒక్కొక్కటి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ స్థలంలో ఉన్నాయి. 2010లో ప్రాజెక్ట్ మొదటిసారి ప్రారంభించబడినప్పుడు, ఫ్లాట్‌లు చదరపు అడుగులకు రూ.22,000 చొప్పున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం మూర్తి చదరపు అడుగు రూ.59,500తో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

## మిత్రమా డిసెంబర్ 31 వరకు

## చివరి అవకాశం లేకుంటే రూ.10 వేల పెనాల్టీ!




ఆదాయపు పన్ను దాఖలు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌ను తెలుసకోవడం చాలా ముఖ్యం. చిన్నపాటి పొరపాట్లు చేసినా పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. జూలై 31, 2024 ఆదాయపు పన్ను దాఖలుకు చివరి తేదీ ఉండేది. ఈ తేదీని మిస్ అయిన వ్యక్తులు తప్పనిసరిగా డిసెంబర్ 31, 2024లోపు ఆలస్యమైన రిటర్న్‌ను ఫైల్ చేయాలి. దీని కోసం (2024-25 పన్ను దాఖలు) ఆలస్యంగా పన్ను దాఖలు రుసుము రూ.5,000 చెల్లించాలి. అన్నింటిలో మొదటిది. వాపసు ఆలస్యం ఏమిటి? దీనికి పెనాల్టీ ఎంత? మీరు పన్నులు వేయకపోతే ఏమి జరుగుతుందో చూద్దాం. ముందుగా వాయిదా వేసిన ఆదాయపు పన్ను అంటే ఏమిటి? పెనాల్టీ మొత్తం గురించి చూద్దాం.

**ఆలస్యమైన ఆదాయపు పన్ను...**

ఆలస్యమైన ఆదాయపు పన్ను ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139(1) కింద వర్తిస్తుంది. ఇది గడువు తేదీకి లేదా అంతకు ముందు చెల్లింపులు చేయని ఆదాయాన్ని సూచిస్తుంది. ఇది సెక్షన్ 139(4) కింద ఆలస్యమైన ఆదాయంగా పరిగణించబడుతుంది. జూలై 31, 2024 2023-2024 సంవత్సరానికి ఆదాయపు పన్ను ఆలస్యంగా దాఖలు చేయడానికి చివరి తేదీ. పన్ను చెల్లింపుదారులు ఈ సమయానికి వారి వ్యక్తిగత లేదా కార్పొరేట్ ఆదాయపు పన్ను రిటర్న్‌లను అంచనా వేసి దాఖలు చేసి ఉండాలి.

**చివరి తేదీ ఏమిటి?**

ఆలస్యంగా పన్ను దాఖలు చేయడానికి డిసెంబర్ 31చివరి తేదీ. మీరు ఈ తేదీలోపు మీ పన్ను రిటర్న్‌ను ఫైల్ చేయాలి. లేకుంటే పన్ను దాఖలు చేసిన వారికి రూ.10 వేలకు పైగా జరిమానా విధిస్తారు. అంటే మీ ఆదాయం రూ.5 లక్షలు దాటితే పన్ను చెల్లించకుంటే ఈ జరిమానా విధిస్తారు. అలాగే, పన్ను చెల్లింపు ఆలస్యంగా రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఆలస్యమైన ఆదాయపు పన్నును ఎలా ఫైల్ చేయాలి? ఆదాయపు పన్ను శాఖ పన్ను ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌కి వెళ్లండి. మీ పాన్ నంబర్‌తో లాగిన్ కావాలి. ఐటీఆర్ ఫారమ్‌పై క్లిక్ చేయండి. తగిన ఫారమ్‌ను ఎంచుకుని, ఆదాయ సమాచారాన్ని అందించండి. మూల్యాంకన సంవత్సరాన్ని ఎంచుకోండి. ఆదాయం, ఖర్చులు, బాధ్యతలతో సహా సమాచారాన్ని అందించండి. ఆదాయపు పన్ను చెల్లించండి. బకాయి ఉన్న ఆదాయపు పన్నుపై పెనాల్టీ, వడ్డీ విధించబడుతుంది. రిటర్న్‌ని సమర్పించుపై క్లిక్ చేయండి. ఆధార్ వెరిఫికేషన్ కూడా జరుగుతుంది. అలాగే, ఆన్‌లైన్‌లో ఆదాయపు పన్ను చెల్లించేటప్పుడు నెట్ బ్యాంకింగ్ ధృవీకరణ జరుగుతుంది.

# మార్కెట్లోకి హెూండా థర్డ్ జనరేషన్

# అమేజ్ రూ.7.99 లక్షల నుంచి ప్రారంభం




ప్రముఖ కార్ల తయారీ సంస్థ హెూండా ఇండియా తన థర్డ్ జనరేషన్ సబ్ కంపాక్ట్ అమేజ్ కారు దేశీయ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.7.99 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమై రూ.10.89 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది. ఇవీ ఇంట్రడ్యూసరీ ధరలు అని, 45 రోజుల వరకూ బుకింగ్ చేసుకునే వారికి ఈ ధరలు వర్తిస్తాయి. వీ, వీఎక్స్, జడ్ఎక్స్ వేరియంట్లలో న్యూ అమేజ్ లభిస్తుంది. న్యూ మారుతి సుజుకి డిజైర్, హ్యుండాయ్ ఔరా, టాటా టైగోర్ వంటి పాపులర్ కంపాక్ట్ సెడాన్‌లతో పోటీ పడుతుంది. సెకండ్ లెవల్ అడాస్ షూట్ తో వస్తున్న హెూండా అమేజ్ అత్యంత పాపులర్ కారు. కొల్లిషన్ మిటిగేషన్ బ్రేకింగ్, ఆటో హై బీం, అడ్వాన్స్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీపింగ్ అసిస్ట్, రోడ్ డిపార్చర్ మిటిగేషన్ తదితర ఫీచర్లు ఉన్నాయి. ఆసక్తి గల కస్టమర్లు ఆన్‌లైన్‌లో గానీ, సమీప డీలర్ల వద్ద గానీ బుక్ చేసుకోవచ్చు. 2025 జనవరి నుంచి డెలివరీలు ప్రారంభిస్తారు. హెూండా న్యూ అమేజ్ కారు 1.2 లీటర్ల, ఫోర్ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ తదితర ఫీచర్లు ఉంటాయి. హెూండా లేన్ వాచ్ కెమెరా ఉంటుంది. ఇది బ్లైండ్ స్పాట్ మానిటర్ మాదిరిగా పని చేస్తుంది.

**హెూండా అమేజ్ వీ వేరియంట్ ఇలా**

హెూండా అమేజ్ వీ వేరియంట్ ఎంట్రీ లెవెల్ కారు. పవర్ అడ్జస్టబుల్, బాడీ కలర్డ్ ఓఆర్వీఎంస్ విత్ ఎల్ఈడీ టర్న్ ఇండికేటర్స్, 8-అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ విత్ వైర్ లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే, సెమీ డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, 7- అంగుళాల ఎంఐడీ ఉంటాయి. వాయిస్ కమాండ్స్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్, మాన్యువల్ ఎయిర్ కండిషనింగ్, స్టీరింగ్ మౌంటెడ్ కంట్రోల్స్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్, టిల్ట్ స్టీరింగ్ అడ్జస్ట్, 14 అంగుళాల స్టీల్ వీల్స్ విత్ కవర్స్, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్ లైట్స్ విత్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఎల్ఈడీ టెయిల్ లైట్స్, షార్క్ ఫిన్ యాంటినా ఉంటాయి. హెూండా అమేజ్ వీ వేరియంట్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ రూ.8 లక్షలు (ఎక్స్ షోరూమ్), సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ రూ.9.20 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.

ఫ్యాబ్రిక్ అప్ హెూల్‌స్టరీ, రేర్ ఆర్మ్ రెస్ట్ విత్ కప్ హెూల్డర్స్, పెడల్ షిఫ్టర్స్ (సీవీటీ), కీ లెస్ ఎంట్రీ, ఎలక్ట్రికల్ ట్రంక్ లాక్ విత్ కీలెస్ రిలీజ్, ఆల్ ఫోర్ పవర్ విండోస్, 6 ఎయిర్ బ్యాగ్స్, ఏబీఎస్ విత్ ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్సీ), ట్రాక్షన్ కంట్రోల్, డే / నైట్ ఇన్ సైడ్ రేర్ వ్యూ మిర్రర్, 3- పాయింట్ సీట్ బెల్ట్స్, హెడ్ రీస్ట్రైంట్స్ ఫర్ ఆల్ సీట్స్, హిల్ స్టార్ట్ అసిస్ట్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్, రేర్ పార్కింగ్ సెన్సర్లు అండ్ కెమెరాలు ఉంటాయి.

**హెూండా అమేజ్ వీఎక్స్ ఇలా**

హెూండా అమేజ్ మిడ్ స్పెషిఫికేసన్ వీఎక్స్ ట్రిమ్ కారు మాన్యువల్ ట్రాన్స్ మిషన్ వేరియంట్ రూ.9.10 లక్షలు (ఎక్స్ షోరూమ్), సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ వేరియంట్ రూ.10 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. అదనంగా ఎల్ఈడీ ప్రొజెక్టర్ ఫాగ్ లాంప్స్, 15-అంగుళాల అల్లాయ్ వీల్స్, పవర్ ఫోల్డింగ్ వింగ్ మిర్రర్స్ తోపాటు సాటిన్ మెటాలిక్ గార్నిష్ ఆన్ డాష్ బోర్డ్, పుష్ స్టార్ట్ అండ్ స్టాప్ బటన్, ఆటో హెడ్ ల్యాంప్స్, వైపర్స్, రేర్ డీఫాగర్, రిమోట్ ఇంజిన్ స్టార్ట్ (సీవీటీ), ఆటో క్లైమేట్ కంట్రోల్ విత్ మ్యాక్స్ కూల్ మోడ్, రేర్ ఏసీ వెంట్స్, వైర్ లెస్ చార్జర్, కనెక్టెడ్ కార్ టెక్ విత్ అలెక్సా కంపాటిబిలిటీ, టూ అడిషనల్ ట్వీటర్లు, రేర్ వ్యూ కెమెరా, లేన్ వాచ్ కెమెరా ఉంటాయి.

**రూ.9.70 లక్షల నుంచి అమేజ్ జడ్ఎక్స్**

టాప్ స్పెక్ జడ్ఎక్స్ ట్రిమ్ కారు డ్యుయల్ టోన్ 15-అంగుళాల వీల్స్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి హెూండా సెన్స్ అడాస్ ఫీచర్లు, ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్, లేన్ కీపింగ్ అసిస్ట్, ఆటో హై బీం తదితర ఫీచర్లు ఉంటాయి. రేడియంట్ రెడ్ మెటాలిక్, ఒబ్సిడియాన్ బ్లూ పెరల్, గోల్డెన్ బ్రౌన్ మెటాలిక్, మీటరాయిడ్ గ్రే మెటాలిక్, లునార్ సిల్వర్ మెటాలిక్, ప్లాటినం వైట్ పెరల్ రంగుల్లో అమేజ్ కారు లభిస్తుంది. 1.2 లీటర్ల 4-సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ విత్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ వేరియంట్లలో లభిస్తుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 90 హెచ్పీ విద్యుత్ %-% 110 ఎన్ఎం టార్చ్ వెలువరిస్తుంది. సీవీటీ మోడల్ కారు లీటర్ పెట్రోల్ పై 19.46 కి.మీ, 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ ఆప్షన్ 18.65 కి.మీ మైలేజీ ఇస్తుంది. మూడేండ్లు స్టాండర్డ్ వారంటీతోపాటు దాన్ని అపరిమిత దూరంతోపాటు ఏడేండ్ల వరకూ పొడిగించుకునే అవకాశం ఉంటుంది. అప్ రైట్ గ్రిల్లె, ట్విన్ పాడ్ ప్రొజెక్టర్ హెడ్ లైట్స్, సింపుల్ అండ్ నీట్ బంపర్ డిజైన్ విత్ ప్రొజెక్టర్ ఫాగ్ ల్యాంప్స్ తదితర ఫీచర్లు ఉంటాయి.

# సరికొత్త మ్యూచువల్

# ఫండ్ ఇన్వెస్ట్ చేస్తే లాభాల పంటే



ఇది ఒక ఈక్విటీ ఫండ్ లాంటిది. ఇందులో కొన్ని ఫండ్స్ సమ్మేళాలను కలిగి ఉంటుంది. అందులో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ లాభాలు పొందవచ్చు. యాక్టివ్ మమూమెంట్ ఫండ్ ప్రణాళిక. యూనియన్ మ్యూచువల్ ఫండ్ తన కొత్త ఫండ్ ఆఫర్ %-% యూనియన్ యాక్టివ్ మొమెంటం ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఊపందుకుంటున్న స్టాక్‌లలో పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించి, ఫ్యాక్టర్-బేస్డ్ ఇన్వెస్టింగ్‌లోకి ప్రవేశించడాన్ని ఇది సూచిస్తుంది. మొమెంటం ఫండ్ నవంబర్ 28, 2024 నుండి సభ్యత్వాల కోసం ఓపెన్ చేయగా, ఇప్పుడు ముగియనున్నట్లు ప్రకటించింది. ఫండ్ (న్యూ ఫండ్ ఆఫర్ ) నవంబర్ 28న సబ్‌స్క్రిప్షన్‌ల కోసం ప్రారంభించగా, డిసెంబర్ 12, 2024న క్లోజ్ కానుంది. అయితే సబ్‌స్క్రిప్షన్‌లు కేటాయింపు నుండి 5 పని దినాలలోపు తిరిగి తెరవనున్నారు. యూనియన్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్. మొమెంటం థీమ్‌ను అనుసరించే స్కీమ్. ఇది మొమెంటం చూపించే స్టాక్‌లలో పెట్టుబడి పెడుతుంది. యూనియన్ యాక్టివ్ మొమెంటం ఫండ్, యాజమాన్య పరిమాణాత్మక నమూనాను అనుసరిస్తుంది. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడానికి నియమ నిబంధనలతో అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. మొమెంటంకు సంబంధించిన వివరాలను అందిస్తుంది. అయితే ఈ పెట్టుబడులు పూర్తిగా నియమ నిబంధనలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో ఇన్వెస్ట్ చేయడం, పెట్టుబడిదారులకు లాభాలు అందించడం, వారి సమస్యలను సులభతరం చేస్తుంది. అంతేకాదు పెట్టుబడులపై నిరంతరం పర్యవేక్షిస్తుందని కో-ఫండ్ మేనేజర్ గౌరవ్ చోప్రా తెలిపారు. ఇది ఒక ఈక్విటీ ఫండ్ లాంటిది. ఇందులో కొన్ని ఫండ్స్ సమ్మేళాలను కలిగి ఉంటుంది. అందులో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ లాభాలు పొందవచ్చు. యాక్టివ్ మమూమెంట్ ఫండ్ ప్రణాళిక 15 ఏళ్లుగా పలు రకాల ఫండ్స్ ఫాలో అవుతూ యూనియన్ యాక్టీవ్ ఫండ్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. ధర పెరుగుదల, స్థిరమైన లాభాలు, ఈక్విటీ మొదలైన వాటితో ట్రస్ట్ ముందుకు సాగుతోంది. అంతేకాకుండా ఈ ట్రస్ట్‌పై పెట్టుబడిదారుల నమ్మకాన్ని చేకూరుస్తోంది. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు సరైన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి మంచి వ్యూహాలను అందిస్తుంది. అలాగే ఈ ఫండ్‌లో పెట్టుబడులపై పూర్తిగా నియమ నిబంధనలతో ఉంటాయి. సంజయ్ బెంబాల్కర్, హెడ్ ఈక్విటీ జోడించారు, "మొమెంటం పెట్టుబడిదారులు ఎలా వ్యవహరిస్తారు అనే దాని గురించి ఈక్విటీ హెడ్ సంజయ్ బెంబాల్కర్ మాట్లాడారు. ఇన్వెస్టర్లకు సరైన సమాచారం అందించడం, స్టాక్ ధరలను పెంచడం, పెట్టుబడిదారులు లాభాలు అర్జించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. అన్ని స్కీమ్ సంబంధిత వివరాలు పూర్తిగా తెలుసుకొని ఇన్వెస్ట్ చేయడం మంచిది.

## వికారాబాద్ కుర్రోడి సత్తా రూ.2 కోట్ల

# ప్యాకేజీతో అమెజాన్‌లో కొలువు




తెలంగాణ కుర్రోడు దిగ్గజ వ్యాపార సంస్థ అమెజాన్ లో భారీ ప్యాకేజీతో కొలువు దక్కించుకున్నాడు. ఎక్కడో మారుమూల గ్రామంలో చదువుకుని అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన అమెజాన్ లో ఉన్నత కొలువు దక్కడంటై గ్రామస్థులతో పాటు, తల్లిదండ్రులు సైగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఏకంగా గ్రోబల్ ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో ఏడాదికి రూ.2 కోట్ల వార్షిక ప్యాకేజీతో కొలువు దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పటికే ఆఫర్ లెటర్ కూడా అందుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఉద్యోగంలో చేరేందుకు సిద్ధమయ్యాడు. అతనెవరో.. ఏం చదువుకున్నాడో.. ఆ వివరాలు మీకోసం.. వికారాబాద్ జిల్లాలోని బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన అర్బాజ్ ఖురేషీ గురించే మనం చర్చిస్తుంది. అర్బాజ్ ఖురేషీకి చిన్నప్పటి నుంచే చదువుపై మక్కువ ఎక్కువ. ఐఐటీ పట్నాలో బీటెక్‌లో సీటు దక్కించుకున్న అర్బాజ్ ఖురేషీ 2019లో ఖురేషీ కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ డిగ్రీ పూర్తి చేశాడు. బీటెక్ మూడో ఏడాదిలో ఉండగానే.. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ మెషిన్ లెర్నింగ్ ఎక్స్‌ఫర్ట్ గేల్ డయాస్ వద్ద 3 నెలలు ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేశాడు. ఆ తర్వాత బెంగళూరులోని మైక్రోసాఫ్ట్ రీసెర్చ్‌లో ఉద్యోగం రావడంతో.. అక్కడ రెండేళ్ల పాటు జాబ్ చేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి, అక్కడ యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%), మెషిన్ లెర్నింగ్‌లో ఎంఎస్ పూర్తి చేశాడు. తాజాగా ప్రఖ్యాత వ్యాపార దిగ్గజం అమెజాన్ ఐటీ సంస్థలో కొలువు దక్కించుకున్నాడు. ఏకంగా రూ.2 కోట్ల వార్షిక వేతనంతో సోమవారం నుంచి విధుల్లో చేరనున్నాడు. ఖురేషీ తండ్రి యాసిన్ ఖురేషీ కూడా తెలంగాణలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు. అర్బాజ్ ఖురేషీకి దక్కిన అరుదైన అవకాశం పట్ల తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.


## త్వరలో ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా




దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ మేజర్ ఎల్‌జీ అనుబంధ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా త్వరలో ఐపీఓకు రానున్నది. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ'కి ముసాయిదా పత్రాలు సమర్పించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఈ ఐపీఓ జరుగబోతున్నది. రూ.15,237 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంతో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు వెళుతోంది. ఈ ఐపీఓలో ఎల్‌జీ ప్రమోటర్ సంస్థ 'ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐఎన్సీ 10.18 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్ క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, సిటీ గ్రూప్ బుక్, జేపీ మోర్గాన్ సంస్థలు ఐపీఓ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి. దక్షిణ కొరియా ఆటో మేజర్ హ్యుండాయ్ మోటార్ ఇండియా ఐపీఓ ద్వారా రూ.27 వేల కోట్ల నిధులు సేకరించిన కొన్ని రోజులకే ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు వెళ్లడం ఆసక్తికర పరిణామం. దేశంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా.. వాషింగ్ మిషన్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు విక్రయిస్తున్నది.

## 25 ఏళ్లు.. రూ.85 లక్షల కోట్లు

ఎఫ్‌డీఐలకు అడ్డాగా భారత్.. డీపీఐఐటీ




సరళీకృత ఆర్థిక విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు భారత్ కేంద్రంగా మారుతోంది. 2000 సంవత్సరం సెప్టెంబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో మన దేశం 1,03,340 కోట్ల డాలర్ల (సుమారు రూ.84.5 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఆదివారం ఇందుకు సంబంధించిన గణాంకాలు విడుదల చేసింది. ఈక్విటీ పెట్టుబడులు, ఆ పెట్టుబడులపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టడం, ఇతర మూలధన పెట్టుబడులన్నీ ఎఫ్‌డీఐ కోవలోకి వస్తాయి. ఈ పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో 25 శాతం ఒక్క మారిషస్ నుంచే రావడం విశేషం. సింగపూర్ (24 శాతం), అమెరికా (10 శాతం), నెదర్లాండ్ (7 శాతం), జపాన్ (6 శాతం), యూకే (5 శాతం), యూఏఈ (3 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.